# దక్షిణ — ప్రదక్షిణ

కాఫీ కప్పులు చేతుల్లోనికి తీసుకుని సుందరమ్మ, కమల ఇద్దరూ ఎదురు ఎదురుగా కూర్చున్నారు.

సుందరమ్మ బిస్కట్ల ప్లేట్ కమల వైపు జరుపుతూ "ఆలస్యం అయిందే మమ్మా ఇవాళ?" అంది.

"నాలుగున్నర అయినా కాకుండా ఇంటికి వచ్చినా, ఇంకా నీకు ఆలస్యం యినట్లే ఉంటే, నేనేం చేసేది?" అంది కమల నవ్వుతూ.

ముచ్చటగా మూడు గంటలసేపు పని చేసి ఇంటికి వచ్చేసిన రోజున సుంద రమ్మకు ఆనందంగా ఉంటుంది. కూతురు కష్టపడిపోతోందని ఒకటే దిగులు ఆమెకు.

"అయినా నీకు ఈ ఉద్యోగం ఎందుకమ్మా?" హాయిగా కూర్చుని కథలు, నవలలు రాసుకోక— అంటుంది. సుందరమ్మ.

కమల ఎం.ఏ. చదవడం సుందరమ్మకు అంతగా ఇష్టం లేకపోయినా భర్తగారి చివరికోరిక తీర్చడం కోసం నోరు మెదపకుండా ఉండిపోవలసి వచ్చింది.

"మీ చెల్లెలు కొడుకు సురేష్ సిద్ధంగా ఉన్నాడు. మూడు ముళ్ళూ వేసేస్తే ఆ బాదరబందీ తీరిపోతుంది" అని నస మొదలెట్టింది, కమల హైస్కూలులో ఉన్నప్పుడే.

"ఆ పని ఎలాగూ చేస్తామనుకో. అందుకోసం చదువుకోకపోవడం ఎందుకు?" అన్నా రాయన.

"అమ్మాయిని దాని ఇష్టం వచ్చినంతవరకు చదివించు, సుందరం. చదువులే సుఖజీవనానికి దోహదం అవుతాయి ముందు ముందు" అంటూ ఆయన ఇంకో అరగంటలో బలవన్మరణం పొందుతా రనగా చెప్పారు. కారు యాక్సి డెంట్ అయి రెండు రోజులు కోమాలో ఉండి తరువాత ఒకే ఒక అరగంట

తెలివి తెచ్చుకుని భార్యకు చెప్పగలంతా చెప్పి మరీ ప్రాణం వదిలాడు ఆ పుణ్యపురుషుడు. అందుచేత సుందరమ్మ ఏమాత్రం అరమరికలేకుండా ఆనందంగా కమలను ఎం.ఏ. చదివించింది. తరువాత కాలేజీలో లెక్చరరు ఉద్యోగం చేస్తానన్నా కాదనకుండా ఒప్పుకుంది.

"ఎందుకమ్మా ఉద్యోగం, చేయదలుచుకంటే రిసెర్చిచేయి–" అన్నదిగాని, కమల లెక్చరరుగా ఉండడంవల్ల రిసెర్చికి ఎక్కువ అనుకూలం అవుతుందని చెప్పడంతో అలాగే అనడం తప్ప ఇంకేమీ చేయలేకపోయింది.

ఉన్న ఊళ్ళోనే ఉద్యోగం.

అబ్బాయి ఎలాగూ ఇక్కడ లేనేలేడు. ఎం.బి.ఏ. చేస్తూ దూరంగా కలకత్తాలో ఉండిపోయాడు ఓ సంవత్సరంగా. ఇంకా, రెండేళ్ళు అయితే గాని వాడి ఉద్యోగాన్ని గురించి, స్థిరపడటాన్ని గురించి ఆలోచించే స్థితి రాదు.

కాఫీ కప్పు కాళీ అయిన తరువాత "ఏమిటమ్మా చెప్పా లనుకున్నావు?" అని అడిగింది కమల.

"నే నేం చెప్పా లనుకోలేదు తల్లీ. బల్లమీద ఉత్తరాలు చూడు నీకే తెలుస్తుంది" అంది.

"అబ్బ ఏమిటో చెబుదూ. ఎందుకొచ్చిన సస్పెన్స్."

"మీ బావ సురేష్ పెళ్ళట. శుభలేఖ పంపించారు సిగ్గు లేకుండా"

"ఓ! మై గాడ్! అదా నీ కోపం?"

"నా కేం కోపం లేదు, నన్నాట్టే విసిగించక వెళ్లు."

బల్లమీద ఉత్తరాలు నాలుగయిదు ఉన్నాయి. తతిమ్మావన్నీ పక్కకు నెట్టి శుభలేఖ కవరు చేతిలోకి తీసుకుంది.

సురేష్ వెడ్స్ సురేఖ – అని కవరు మీదే బంగారపు అక్షరాలతో అచ్చువేశారు. ఈ సురేఖ స్థానంలో 'కమల' అని ఉండాలని తను పుట్టినప్పుడే అందరూ – అటు ఇటూ కూడా – తీర్మానం చేసుకున్నారని కమలకు ఘంటాపథంగా తెలుసు. అలా జరగకుండా పోవటానికి సురేష్ గట్టి అభిప్రాయాలే తప్ప మరో కారణం లేదని కూడా తెలుసు.

కమల బి.ఏ. రెండో సంవత్సరంలో ఉన్నప్పుడు కాబోలు వచ్చాడు సురేష్ ఇక్కడికి వేసవి సెలవులకు. మామూలుగా మాంచి హుషారయినవాడు. చెప్పిన సంగతి చెప్పకుండా ఎప్పుడూ ఏదో మాట్లాడుతూనే ఉంటాడు. నోరు తెరు

చుకు వినడం తప్ప ఇంకేమీ చేసేవాళ్ళు కాదు సుందరమ్మ, కమల.

అప్పుడు అన్నాడు సురేష్ కమలతో ఒక సాయంకాలం – "కమలా! కాసేపు స్ట్రెయిట్ టాక్ చేయాలని ఉంది" అని.

కమల గుడ్లు అప్పజెప్పి చూసింది.

"ఎందుకట్లా గుడ్లగూబలా చూస్తావు. అర్థం కాలేదా నేను చెప్పింది?"

"ఇప్పుడు సూటిగా మాట్లాడకుండా, వంకర్లు తిరిగిపోయి మాట్లాడుతున్నావా ఏమిటి బావా?"

సురేష్ ఈ జోక్‌కు నవ్వాడు.

"అబ్బో అబ్బో. నువ్వు కూడా మాటలు తిరగమక చేస్తావే!"

"సహవాస దోషం"

సురేష్ మళ్ళీ గంభీరంగా మారిపోయాడు.

"ఇంతకూ సంగతి ఏమిటంటే..."

"ఉపోద్ఘాతం లేకుండా చెప్పవు గదా..."

"ఏం లేదు. నేను చెప్పేది నీ మనసుకు కష్టంగా ఉంటుందేమోనని ఆలోచిస్తున్నాను. అయినా అర్థం చేసుకోగలవు గదా... ఆ మాత్రం తెలియకుండా ఉంటుందా బి.ఏ. చదువుతున్న పిల్లకు..." అని ప్రారంభించాడు.

కమలకు అతని ధోరణి ఏమీ అర్థం కాలేదు.

చెప్పు అన్నట్లుగా తల ఊపింది.

"ఏమీలేదు కమలా. నన్ను గురించి ఇంట్లో వాళ్ళు ఏమనుకుంటున్నారో వింటున్నావు గదా!"

కమల ముసి ముసిగా నవ్వుకుంది. "ఇంట్లో వాళ్ళు ఎవరు బావా?"

"అదే మా ఇంట్లోను, మీ ఇంట్లోను..."

"మా ఇంట్లో అమ్మా, తమ్ముడూ... వాళ్ళేం అనుకోవడంలేదే నిన్ను గురించి! మరి మీ ఇంట్లో ఏమనుకుంటున్నారో తెలీదు." కొంటెగా అతని వైపు చూసింది. సిగ్గు కూడా ముంచుకు వచ్చింది కమలకు.

సురేష్‌కు ఒక్క క్షణం కమల అక్కడినుంచి వెళ్ళిపోతుందేమోనని భయం కూడా వేసింది.

"ఆగు, కమలా. నీకు ఇప్పుడే చెప్పివేయడం మంచిది."

"నే నేం చెప్పవద్దనడంలేదుగా" అంది కమల పళ్ళు బిగపట్టి.

"నీ కట్లా నవ్వులాటగానే ఉంటుంది... నాకు ఎలా చెప్పాలో తెలియడం లేదు."

"అయితే చెప్పడం మానివేయి" అని లేవబోయింది కమల.

"అయ్యో!" అంటూ ఆమెను చేయి పట్టుకు ఆపాడు.

"అదుగో, నన్ను తాకవద్దంటే వినవు."

"సారీ, కమలా!"

"ఇంతకూ నువ్వు అనేది ఏమిటి బావా?"

"నువ్వు గాభరాపడవు గదా."

"నేను పడతానో, లేదో గాని నువ్వు మాత్రం ఉక్కిరి బిక్కిరి అయిపోతు న్నావు. రెండు నిముషాలలో చెప్పావా సరేసరి. లేకపోతే నేను మా అమ్మ దగ్గరకు వెళ్ళి కూచుంటాను. నువ్వు ఊరికి వెళ్ళేంతవరకూ కనిపించనే కనిపించను."

సురేష్‌కు యాతన అయిపోతోంది, చెప్పదలుచుకున్నది బయట పెట్టటం.

ఒక స్థితిలో కమల అతన్ని తల్లకిందులుగా అర్థం చేసుకుంది గూడాను. అతను ఎక్కడ 'ప్రి-మారిటల్ సెక్స్, గురించి అడుగుతున్నాడో అనుకుని ముఖం కందగడ్డ చేసుకుని – 'నాకు అలాంటివి ఇష్టంలేదు బావా' అనేసింది' ఇలాంటి విషయాలలో ఆదినిష్ఠూరమే మంచిదని.

"నువ్వు నన్ను అర్థం చేసుకోవడంలేదు."

"పోనీ, నాకు అర్థం అయేట్లు చెప్పరాదూ?"

"అది చేతకాకనే కదూ, ఇందాకటి నుంచి అఘోరిస్తున్నది..." అని సురేష్ ధోరణి మార్చి – "నీ పెళ్ళి విషయం అత్తయ్య కెందుకు అంత తొందర?" అనడిగాడు.

మన పెళ్ళి అనకుండా 'నీ' పెళ్ళి అనడం కమలకు కాస్త ఎబ్బెట్టుగా అని పించింది.

"ఆ సంగతి అత్తయ్యనే అడుగు" అంది తల వంచుకుని.

"అదికాదు కమలా. నేను చెప్పేది ఏమిటంటే - మనిద్దరకీ పెళ్ళి చేయాలని అందరూ చూస్తున్నారు."

ఇందులో తప్పు ఏమిటో కమలకు అర్థం కాలేదు.

"కాని... కమలా... నేను అనుకుంటున్న దేమిటంటే.."

"ఏమిటో చెప్పు బావా. దానికి అంత సందేహం ఎందుకు?"

"నువ్వు నన్ను మరోలా అనుకోకూడదు?"

"నువ్వు ఏం చెప్పినా నేనేమీ అనుకోను. సరేనా? చెప్పు."

"మనం పెళ్ళి చేసుకోకూడదు కమలా."

కమలకు మిన్ను విరిగి మీద పడినట్లు అవలేదు గాని, బావ ధోరణి ఏ మాత్రమూ అర్థం కాలేదు.

"నీ కేమన్నా మతి పోయిందా ఏమిటి బావా?"

"లేదు కమలా. మతి సరిగా ఉండే మాట్లాడుతున్నాను. అంతేకాదు. ముందు తరాల వాళ్ళకు కూడా మతి సరిగా ఉండడం కోసమే ఈ ఆలోచన."

"నాకు తెలిసేటట్లు చెప్పు బావా."

"కమలా! మేనరికాలు చేసుకోవడంవల్ల చాలా ఇబ్బందులు ఉన్నాయి."

"అవును. కట్నకానుకలు, ఇతర లాంఛనాలు తగ్గిపోతాయి" అంది కమల అతన్ని కవ్వించటానికా అన్నట్లు.

"అబ్బ. నీ సినిసిజం మాను."

"ఏమిటో అయితే నీ లాజిక్."

"మనవి ఇప్పటికే రెండు తరాల నుంచి మేనరికాలు చేసుకుంటూ ఉన్న వంశాలు."

"అవును. అందుకనే కదూ, మేనరికం తప్పించకుండా ఉండడం కోసమేగా అమ్మ తంటాలు పడుతూ ఉంది."

అప్పుడు చెప్పాడు సురేష్... వైద్యశాస్త్రరీత్యా, మానవ శరీరంలోని జీన్స్ పరిణామాల దృష్ట్యా దగ్గర దగ్గర వాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకుంటే మూడో తరంలో ఎలా పిల్లలకు అంగవైకల్యాలు ఏర్పడుతాయో.. మానసిక వికారాలు కలుగుతాయో... సరళంగా సజావుగా వెళ్ళిపోవలసిన జీవితం ఎలా వంకరలు తిరిగిపోయి అస్తవ్యస్తంగా అయిపోతుందో... అంతా తన ప్రొఫెసర్లు చెప్పిన మాటలు, సాధికారంగా 'కొటేషన్లు' ఇస్తూ ఏక బిగిని చెప్పేశాడు. అంతా చెప్పి, 'ఇదీ

సంగతి, కమలా, నన్నేం అపార్థం చేసుకోకు. నాకు నీవంటే ఇష్టం లేదనుకోకు' అన్నాడు.

కమలకు బాగా అర్థం అయింది. శాస్త్రీయ దృక్పథం బాగా వంట పట్టించు కున్న బావ మాట వినడమే మంచిదని వెంటనే స్ఫురించింది. తనంటే ఎంత ఇష్టం, ఆత్మీయత ఉన్నా.. వివాహానికి మాత్రం వల్లకాదు అంటున్నాడంటే -- అతని ఆర్గ్యుమెంట్‌లో ఎంతో సత్యం ఉండాలి.

"అట్లాగే బావా. నీకు ఇష్టం లేకపోతే ఇది జరగదు. మరేం బెంగ పెట్టు కోకు" అంది.

"కోపం వచ్చిందా కమలా? నాకు ఎందుకు ఇష్టంలేదో చెబుతున్నా కదూ."

"నాకు కోపం లేదు బావా... కాకపోతే మా అమ్మా, మీ అమ్మా, నాన్న ఎలా ఫీలవుతారా అని ఆలోచిస్తున్నాను. అంతే."

"వాళ్ళ దృష్టి నుంచి ఆలోచించి మనం ఇరుకున పడగూడదు. ఏదయినా మంచి ఉపాయం చూసి ఇందులోంచి ఇవతల పడాలి." అన్నాడు.

"ఉపాయమా? అంటే?"

"వాళ్ళకు శాస్త్రీయ దృక్పథం అంతగా ఉండదు కనుక నేను చెప్పేమాటలు తేలికగా కొట్టేస్తారు. మన మాట పడనివ్వరు. అందుచేత ఇంకేదయినా..."

"ఏం చేస్తా నంటావు?"

"నీవే ఆలోచించాలి."

"ఊహూ"

"నీకు ఇష్టం లేదని నువ్వు చెప్పెయ్యి. అప్పుడు మీ అమ్మ నిన్ను అంతగా బలవంతం చేయదు. మా అమ్మా, నాన్నలను నేను ఆ పైన ఎలాగయినా ఒప్పిస్తాను."

"నాకు ఇష్టం లేదని ఎట్లా చెప్పేది బావా? అకస్మాత్తుగా ఇష్టం లేకపోవ టానికి ఇప్పుడు ఏం జరిగిందని?

కమల తనతో ఎగతాళిగా మాట్లాడుతోందని సురేష్ ముఖం గంటు పెట్టు కున్నాడు.

కాసేపాగి కమల "అదేం లాభంలేదు, బావా. ఉన్న విషయం చెప్పివేయడమే శ్రేయస్కరం అనిపిస్తోంది నాకు. పెద్దవాళ్ళను వొప్పించటానికి ప్రయత్నిద్దాం. అంతేకాని దానికోసం లేనిపోని అబద్ధాలు ఎందుకు?"

శాస్త్రీయ దృక్పథంలో ఎంత విశ్వాసం ఉన్నా, పెద్దవాళ్ళను ఒప్పించటంలో కష్టనిష్ఠూరాలు తెలిసినవాడు కనుక సురేష్ వెంటనే అంగీకరించలేకపోతున్నాడు. కమల మటుకు అబద్ధం ఆడడం అనవసరం – అనే ఆలోచన నుంచి దూరం పోలేకపోతోంది.

"యూ డెవిల్. నేను చెప్పినట్లు చేయి" అన్నాడు సురేష్ విసిగిపోయి.

"ఆ పని నువ్వే చేయకూడదా బావా. ఇందులో నన్ను ఇరికించడం దేనికి? నీకే ఇష్టంలేదని చెప్పవచ్చు కదా!"

"నాకు ఇష్టం లేదంటే వినేవాడు ఎవడోయ్. మా అమ్మ చెప్పచ్చుకు కొడుతుంది. మా నాన్న చర్మం వొలిచి చెప్పులు కుట్టిస్తానంటాడు. అదే మాట నువ్వు చెప్పావంటే దానిమీద ఎవరూ ఏమీ వ్యాఖ్యానం చేయరు.చక్కగా కట్టుబడి ఉంటారు. కాకపోతే... ఆడపిల్లలకు చదువులు చెప్పినందువల్ల జరిగే అనర్థాలలో ఇది కూడా ఒకటయిపోతుంది. అందుచేత భయం అక్కర్లేదు."

"నిన్ను చేసుకోవడం ఇష్టంలేదని నేను మాట మాత్రం కాదు కదా, సూచనగా కూడా చెప్పలేను. పైగా పెద్దవాళ్ళను మభ్య పెట్టడంలో నాకు ఏమాత్రం అభిలాష లేదు."

"అయితే ఏమంటావు?"

"నీకు చెప్పడం చేతకాకపోతే నేనే చెబుతాను, అసలు విషయం మా అమ్మతో, అత్తయ్య – మామయ్యలతో – అంతేగాని..."

సురేష్‌కు ఇంతకంటే దారి లేకపోయింది.

పడవలసిన శ్రమంతా కమలే పడతానంటుంది గనుక ఎందుకు కాదనాలి? ఎలాగయినా కమల డేర్ డెవిల్... అనుకున్నాడు.

కమలకు ఇదంతా గుర్తుకు వచ్చింది.

అందరూ ఈ విపర్యయంతో రాజీ పడగలిగారు గాని, సుందరమ్మ మాత్రం సమరసంగా ఉండలేకపోయింది.

చనిపోయిన అన్నగారి ఆత్మ శాంతికోసం అయినా తన వదినగారు భర్తను కొడుకును మెడలు వంచి, ఒప్పించి, ఈ వివాహం జరిగేట్లు చూడవలసిన బాధ్యత తీసుకోవాలని ఆమె ప్రగాఢంగా నమ్మింది. అందుచేత ఎవరినయినా క్షమించగలదు గాని, తన వదినగారిని మాత్రం క్షమించలేదు.

కమల రెండు ఇళ్ళ వాళ్ళకు ఈ సంగతి బట్టబయలు చేసిన తరువాత –

అంతవరకు సఖ్యంగా ఉన్న రెండు కుటుంబాల మధ్య రాకపోకలు దాదాపు క్షీణించుకుపోయినాయి.

సంవత్సరాలు గడిచాయి.

అప్పటికి ఇప్పుడు ఈ శుభలేఖ; పెళ్ళికి తప్పనిసరిగా రావలిసిందని ప్రత్యేక మయిన ఉత్తరం వచ్చాయి.

బొత్తిగా వారం రోజులయినా లేదు ముహూర్తం అనుకుంది కమల.

"సిగ్గు లేకపోతే నీవు వెళ్ళిరా. అంతేగాని, నేను ఈ పెళ్ళికి రానుగాక రాను" అంది సుందరమ్మ మొదట్లో. కాని కమల విడమరచి చెప్పిన తరువాత ప్రయాణానికి సిద్ధం అయింది.

"నువ్వు ఏమయినా చెప్పు. నాకు మీ మావయ్య, అత్తయ్యల మీద ఏ మాత్రం సానుభూతి లేదు. మనం వాళ్ళ ఊరికి వెళ్ళద్దు. సరాసరి పెళ్ళి జరిగే ఊరికే వెళదాం. ఏదో హోటల్లో దిగి, కళ్యాణ మందిరానికి వెడదాం అంది సుందరమ్మ.'

"పోనీలే, అలాగే చేద్దాం. పెళ్ళి పీటలమీద బావ ముఖం ఎలా ఉంటుందో చూడాలని ఉంది నాకు. తతిమ్మా సంగతులు ఎలా అయినా నాకేం పట్టదు" అంది కమల.

"ఏమిటో ఈ పిల్ల ముచ్చట్లు" – అనుకుంది కమలను గురించి తల్లి. 'ఎలాగయినా నా కూతురు గుండె నిబ్బరం గల మనిషి. జీవితంలో ఎలాంటి సందర్భాన్నయినా ముఖాముఖి సందర్శించగలదు–' అలా కాకుండా పోయి, ఏడ్చి పెడబొబ్బలు పెట్టి ఆ ఇల్లంతా అగంచేసి, బావ మనసు మార్చి ఎలాగ యినా అతన్నే పెళ్ళి చేసుకోగల చాకచక్యం కూడా కమలకు ఉన్నదని ఆమె ఎరుగును. దీన్ని ప్రదర్శించనందుకే ఆమెకు అంత కోపమూను.

వీళ్లు వెళ్ళేసరికి కళ్యాణ మందిరం మామూలు హడావుడిలో మునిగిపోయి ఉంది. సురేష్ అతని తల్లిదండ్రులు ఇద్దర్నీ చూసి సంబరపడిపోయారు.

"వదినగారూ! ఇందులో మా తప్పేం లేదు. అయినా మీరు మమ్మల్ని క్షమించడంలేదు. కానీయండి ఏం చేస్తాం. మాకు ఇంతే ప్రాప్తం అను కుంటాం. స్వర్గంలో ఉన్న మా అన్నయ్యకు నేను ఏనాడో క్షమాపణలు చెప్పుకున్నాను. మా అన్నయ్య సరే నన్నాడు కూడా. లేకపోతే ఇంత చక్కటి సంబంధం మాకు కుదరదు" అంది సురేష్ తల్లి సుందరమ్మను ప్రత్యేకంగా గదిలోనికి తీసుకుపోయి కాఫీ ఫలహారాల పని చూస్తూ.

"నువ్వు రావడం నాకు చాలా సంతోషం" అన్నాడు సురేష్ కమలను ఆనందంగా చూస్తూ.

ఈ మాటలు కేవలం లాంఛనం కోసం అన్నవి కావనీ, హృదయం అట్టడుగు నుంచి ఉబికి వస్తున్నాయని కమలకు తెలుసును.

"అయినా నేను రానని ఎలా అనుకున్నావు?"

"యూ డెవిల్" అన్నాడు సురేష్, పాత రోజులు గుర్తుకు తెచ్చుకుంటూ. ఇద్దరూ పది నిముషాల పాటు నవ్వుకున్నారు.

"ఏదీ నాకు సురేఖను పరిచయం చేయవూ?" అనడిగింది కమల.

"ఆ మూడు ముళ్ళు పడితేగాని నాకు చొరవ రాదనుకుంటాను కమలా!" అన్నాడు సురేష్.

పీటలమీద కూర్చోవలసిన సమయం దగ్గరవుతోంది.

పురోహితుడు ఒకటే తొందర చేస్తున్నాడు.

సురేష్ కదిలి వెళ్ళాడు.

మంత్రతంత్రాలు జరుగుతున్నాయి.

ఆ గందరగోళంలో కూర్చుని ఉండడం కమలకు కష్టంగానే ఉంది. అయినా తమాయించుకుంటూంది.

ఉన్నట్లుండి ఏమిటో గుసగుసలు, నలుగురయిదుగురు చేరి తమలో తాము మాట్లాడుకోవడం ఎక్కువయిపోయింది.

ఉరుకులు పరుగులు. ఏం చేస్తున్నారో వాళ్ళకే తెలియనట్లుగా అందరూ నానా హడావుడిగా ఉన్నారు.

పెళ్ళికూతుర్ని ఇంకా తీసుకురాలేదు, ఎందుకని? -- కొందరు ఈ ప్రశ్న పైకే అనేస్తున్నారు. "బావగారూ! నన్ను క్షమించాలి. ఇప్పటివరకూ శాయశక్తులా ప్రయత్నించాం. ఇక మీ దగ్గర దాస్తే ఫలితంలేదు" అన్నాడు కన్యాదాతగారు సురేష్ తండ్రి రెండు చేతులూ పట్టుకుని.

"ఏమయిందండీ? ఏమిటి సంగతి?"

పెద్ద వాళ్ళంతా ఒక గదిలో చేరారు.

"అమ్మాయి రాత్రినుంచి కనబడకుండాపోయింది. పదిమంది మనుషుల్ని పెట్టి వెదికిస్తున్నాం. వాళ్ళు ఇంకా వెదుకుతూనే ఉన్నారు. ఎక్కడా జాడలేదు.

పోలీసు సహాయం కూడా తీసుకున్నాం. ఎలాగయినా ఈ క్షణానికి దొరికిపోతుం దని వేయి దేవుళ్ళకు మొక్కుకున్నాం. మా మర్యాద దక్కలేదు. మిమ్మల్ని కూడా అగౌరవంపాలు చేయవలసివచ్చింది."

సురేష్ తల్లి, తండ్రీ దిగ్భ్రాంతులయిపోయారు.

"సురేఖ వాళ్ళ కాలేజీలో ఓ కుర్ర లెక్చరరును ప్రేమించింది. మేం మందలించాం. పెళ్ళికి వొప్పుకున్నట్లే నటించింది. వాళ్ళిద్దరూ కలిసి నాటకం ఆడారు. లెక్చరరుకూడా కనిపించడంలేదు. ఎక్కడకు ఉడాయించారో ఏమో... మా నొసట ఈ అవమానమంతా రాసి ఉంటే ఇంకెలా జరుగుతుంది?" ఇలా రకరకాలుగా చెప్పుకు వస్తున్నారు పిల్ల తల్లిదండ్రులు.

ఇక్కడ జరుగుతున్న దేమిటో తెలియని పురోహితుడు "అయ్యా! పెళ్ళి కుమార్తెను తీసుకురండి". అని ఒకటే హుకుం జారీ చేస్తున్నాడు పది నిము షాలనుంచి.

"అయ్యా! కన్యాదాతగారు ఎక్కడ?"

"అయ్యా! పిల్ల మేనమామగారు ఎక్కడ?"

"అయ్యా! ఎవరు తీసుకువస్తున్నారు పిల్లను?"

పోలీసులయినా తీసుకువచ్చి ఈ క్షణానికి, ముహూర్తానికి అప్పజెప్తారేమో నని కన్యాదాతగారి ఆశ. ఆశలన్నీ అడియాసలు కాగా, ఏడుపులు పెడబొబ్బలు మాత్రం మిగిలాయి.

సురేష్ ముఖం చిన్నబుచ్చుకుని వేదికమీద నుంచి దిగాడు. పరిస్థితి ఆకళింపు చేసుకుందుకు అతనికి అయిదారు నిముషాలు పట్టింది.

కమల అతని వంకే చూస్తోంది.

క్షణంలో ఎంత మార్పు!

ఉల్లాసంగా, హుషారుగా ఉన్న మనిషి కాస్తా, నెల రోజుల నుంచి లంఖణాలు చేస్తున్నవాడిలా తయారయిపోయాడు ఈ అయిదారు నిముషాలలోను.

సుందరమ్మ కూతురు చెవిలో -- "బాగా శాస్తిజరిగింది. దేవుడు లేడూ? న్యాయం జయించదూ?" అంది సినిమాలలో సంభాషణలు తలుపుకు తెచ్చు కుంటూ. కమల తల్లి ముఖవంక చూసి "నీకు పుణ్యం ఉంటుంది. పైకి ఏమీ అనకమ్మా, చూడు, పాపం... బావముఖం ఎలా మారిపోయిందో!" అంది.

"ఆ ముఖాన్ని చూసి నువ్వే మురిసిపోవాలి. నాకు ఒక్క పిసరయినా జాలి

లేదు సుమా! నువ్వేమయినా అనుగానీ... పద పోదాం... ఇంకా ఎందుకు ఇక్కడ వేళ్లాడడం? వాళ్ళ ఎనౌన్స్‌మెంట్స్ అన్నీ వింటే గాని కదలబుద్ధి కాదా ఏమిటి నీకు?" అని మందలించింది, కమలను చేయిపట్టుకు తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తూ.

కమలకు ఏదో చేయాలని ఉంది.

ఈ పరిస్థితి – అప్రతిష్ట – అస్తవ్యస్తమయిన సందర్భం నుంచి బావను ఎలాగయినా బయట పడేయాలి.

తల్లి చేయి విదిలించుకుని ముందుకు నడిచింది కమల.

సుందరమ్మ అలా చూస్తూ ఉండిపోయింది.

కమల తిన్నగా సురేష్ దగ్గరకు వెళ్ళింది.

"వెరీ సారీ బావా! ఇలాంటి అసందర్భం జరుగుతుందని... దీన్ని చూడ టానికి వస్తాననీ అనుకోలేదు."

సురేష్ దీనంగా ఆమె ముఖం వంక చూస్తున్నాడు.

ఆ చూపులో ఎన్నో వేల అర్థాలు స్ఫురించాయి కమలకు.

"బావా! నీ వేమీ అనుకోనంటే చెబుతాను. సురేఖను వాళ్ళు బలవంతంగా పట్టుకువచ్చినా, మెడలు వంచి పీటలమీద కూర్చోబెట్టినా నువ్వు మాత్రం పెళ్ళి చేసుకోకు – బావా! ఈ అప్రతిష్ఠ తట్టుకుని బయట పడడం కష్టం అని నాకు తెలుసును. అందుకే చెబుతున్నాను. నాకేం అభ్యంతరం లేదు. నీకు ఇష్టం అనిపిస్తే ఇదే ముహూర్తానికి నన్ను పెళ్ళి చేసుకో."

సురేష్ అయోమయంగా ఆమె వైపు చూశాడు.

ఆమె మాటలు అర్థం అవటానికి అతనికి కొంత సమయం పట్టింది.

"యు... యు... డెవిల్. నిన్నా?... యు ఆర్ ఏన్ ఏంజెల్!... కేవలం నా మీద సానుభూతితో, జాలితో అంటున్నావా? బాగా ఆలోచించు."

"ఇందులో ఆలోచించవలసింది ఏమీ లేదు బావా! నాకు సింపుల్‌గా కనిపిస్తున్నది నీకు కాంప్లెక్స్‌గా అనిపించడం మొదట్నించీ ఉన్నదేగా! నీ ఇష్టం ఇక" – అని మిన్నకుండిపోయింది.

సుందరమ్మ మాత్రం "బాబూ! నీకు వరదక్షిణ ఈ ముహూర్తంలో ఇవ్వ లేను" అంది.

"నాకు వేరే దక్షిణ ఎందు కత్తయ్యా. కమలకు రోజా ప్రదక్షిణం చేసి, ఇన్నాళ్ళూ మిమ్మల్ని మీ మనసుల్ని కష్టపెట్టినందుకు ప్రాయశ్చిత్తం చేసుకుంటాను. అందుకు అవకాశం ఇవ్వు. అంతేచాలు" అన్నాడు.

ఆ రాత్రి ఆమెను దగ్గరకు తీసుకుంటున్నప్పుడు కమల "ఇంతకూ డెవిలో, ఏంజెలో తేల్చుకున్నావా బావా? శాస్త్రీయ దృక్పథం ప్రకారం...?"

"దానికి తిరుగులేని మాట నిజమేగాని, మన శాస్త్రజ్ఞులు ఏదో విరుగుడు కనిపెట్టి చెబుతార్లే. తీరికగా కనుక్కుందాం రేపు. వాళ్ళ ధర్మమా అని రోజు రోజుకూ కొత్త సంగతులు బయట పెడుతున్నారుగా?" అన్నాడు సురేష్ మరింత స్పోర్టివ్‌గా.

మరునాటి సాయంకాలానికి గాని పోలీసులు సురేఖను, కుర్ర లెక్చరరును – అయిదు వందల మైళ్ళ దూరంలోని ఓ నగరం హోటల్లో బస చేసి ఉండగా – అరెస్ట్ చేసి తీసుకురాలేకపోయారు.

సురేష్, కమల వాళ్ళచేత కూడా ప్రదక్షిణలు చేయించి పోలీసుల చేత కూడా అక్షింతలు వేయించారు.